క్లుప్తంగా

16న సామాజిక సాధికార బస్సుయాత్ర

• ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక పట్టణంలో ఈ నెల 16వ తేదీన సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. బస్సుయాత్ర నేపథ్యంలో స్థానిక సూర్యదుర్గా కల్యాణ మండపంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్ హాజరుకానున్నారని, నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు. బస్సుయాత్ర నిర్వహణపై దిశానిర్దేశం చేయడం జరుగుతుందన్నారు.

ముమ్మరంగా ఆస్తిపన్ను వసూలు



ఆస్తిపన్నుకు సంబంధించిన చెక్కును అందిస్తున్న ఇన్నోటెల్ సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లను ముమ్మరంగా చేపడుతున్నామని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని పలు వ్యాపార సముదాయాల వద్ద పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించేందుకు ముందుకురావాలన్నారు. పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తామని, ఇంటి పన్నులు కూడా చెల్లించాలన్నారు. రూ.1,11,454 చెక్కును జేజే ఇన్నోటెల్ యాజమాన్యం అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మందుగుండు విక్రయిస్తే చర్యలు

బొబ్బిలి: అక్రమంగా మందుగుండు సామగ్రి విక్రయిస్తే చర్యలు తప్పవని తూనిక, కొలతల శాఖ అధికారులు హెచ్చరించారు. స్థానిక పట్టణంలో మందుగుండు సామగ్రి విక్రయించే పలు దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అధికారులు మందుగుండు ప్యాకెట్లపై సరిగా వివరాలు లేని మందుగుండును విక్రయిస్తున్న నాలుగు దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

నేత్రవైద్య శిబిరం




కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కందూరి జగన్నాథం మాస్టారు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు వెంకటకృష్ణ ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 100 మంది కళ్లను తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

రేగిడి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని లక్ష్మణవలస గ్రామ పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన పాఠశాల పరిసరాలు, రికార్డులు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు తెలిపారు.

దిశ యాప్‌పై అవగాహన



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి: దిశ యాప్‌తో మహిళలకే కాకుండా ప్రజలందరికీ భద్రత కలుగుతుందని ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని లింగాలవలస గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. తొలుత విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లను వివరించి, దిశ యాప్‌ను ప్రతిఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆపద సమయంలో యాప్‌ను ఆశ్రయిస్తే క్షణాల్లో పోలీసులు వచ్చి, భద్రత కల్పిస్తారన్నారు.

కొప్పల వెలమ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దామోదర్

బొబ్బిలి: కొప్పల వెలమ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మున్సిపాలిటీ పరిధిలోని అప్పయ్యపేటకు చెందిన మాజీ సైనికుడు రెడ్డి దామోదర్ ఎన్నికయ్యారు. స్థానిక పట్టణంలో శుక్రవారం జరిగిన ఎన్నికలో సంఘ సభ్యులు ఆయనను ఎన్నుకున్నారు.



రాజాం: లచ్చయ్యపేటలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు



బొబ్బిలి పట్టణంలోని అగురువీధిలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, అధికారులు



రేగిడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ ప్రచారంలో వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు, తదితరులు



సంతకవిటి: వాసుదేవపట్నం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఏర్పాటు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వంగర: శివ్వాంలో గడప గడపకూ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ తదితరులు

ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి

గ్రామగ్రామాన వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమ ప్రచారం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు హోరెత్తాయి. ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని నేతలు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, వీధుల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటువేసి, గెలిపించాలని కోరారు. ఏ గడపకు వెళ్లి, ఎవరిని అడిగినా జగనే మళ్లీ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.



రాజాం సిటీ: రాజాంలోని ఈశ్వరనారాయణ కాలనీలో ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రామభద్రపురం: సచివాలయం–1 పరిధిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు



మెంటాడ: పిట్టాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు



తెర్లాం సచివాలయం–2 వద్ద జరిగిన వై ఏపీ నీడ్స్‌జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ



తెర్లాంలో ఇంటింటికీ వెళ్లి, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ కరపత్రాలు పంపిణీ చేస్తున్న పార్టీ మండల నాయకులు, గ్రామ వలంటీర్లు



బాడంగి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, వలంటీర్లు



రాజాం: లచ్చయ్యపేటలో రాత్రిబసలో నిద్రిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఓటరుగా నమోదు కావాలి



రాజాం సిటీ: ఓటరు దరఖాస్తులతో విద్యార్థులు

బాడంగి: అర్హులైన వారంతా ఓటరుగా నమోదు కావాలని ప్రిన్సిపాల్ వి.శంకరరావు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుహక్కు నమోదుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని, మన భవిష్యత్ మనం ఓటు మీదే ఆధారపడి ఉందన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన యువతీయువకులంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు ఓటుహక్కు నమోదులో ముందంజలో నిలిచారని డీటీ బి.ప్రకాష్‌రాజు తెలిపారు. మండలంలోని బుచ్చెంపేట సచివాలయ పరిధిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు చేపట్టిన ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పించడంతో పాటు 500 మంది విద్యార్థులు ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను జీఎంఆర్ వీఎఫ్ డైరెక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ సీఎల్ వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అభినందించారు.

15న బాడంగిలో 'స్పందన'కు కలెక్టర్

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన జరిగే స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమానికి కలెక్టర్ నాగలక్ష్మి హాజరవుతారని, మండల స్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో ఆంజనేయులు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన సచివాలయాల వారీగా ప్రజల నుంచి ఎటువంటి వినతులు వస్తాయో ముందుగానే అంచనా వేసి, అందుకు తగిన సమాచారంతో కార్యక్రమానికి రావాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ పి.రామారావు, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, ఏవో రామలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మూడో అంతస్తుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

ఎంవీపీకాలనీ: మూడో అంతస్తుపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఎంవీపీకాలనీలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన సంబంగి నాగభూషణం(58) విశాఖలో ఉంటూ పలుచోట్ల సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తించాడు. చివరగా ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని అమ్మ బాయ్స్ హాస్టల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేశాడు. మద్యం సేవిస్తుండటంతో పాటు ప్రవర్తన బాగోలేదని హాస్టల్ నిర్వాహకులు గతంలో ఆయన్ని విధుల నుంచి తొలగించారు. దీంతో గత నెల 10న నాగభూషణం సొంతూరు వెళ్లిపోయాడు. కాగా.. నాగభూషణం తన తండ్రిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఎంవీపీకాలనీలోని క్యాన్సర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఆయన గతంలో తాను పనిచేసిన అమ్మ బాయ్స్ హాస్టల్‌కు శుక్రవారం మధ్యాహ్నం 12.30 సమయంలో వెళ్లాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్నాడు. 3వ అంతస్తులో ఐరన్ రైలింగ్‌కు ఆనుకుని నిల్చొన్నాడు. ప్రమాదవశాత్తూ రైలింగ్ విరిగిపోవడంతో కింద పడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సంజీవరావు, ఎస్ఐ శ్రీను అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్నయ్య తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలుష్యం కాకుండా దీపావళి జరుపుకోవాలి



అలజంగి పాఠశాలలో ముందస్తు దీపావళి జరుపుకున్న విద్యార్థులు

రాజాం: పర్యావరణం కాలుష్యం కాకుండా దీపావళి పండగ జరుపుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు సూచించారు. ఆదివారం దీపావళి వేడుకలు పురస్కరించుకుని, మండలంలోని లచ్చయ్యపేటలో వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మహిళలతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కాలుష్యం జరగకుండా దీపావళి జరుపుకోవాలని కోరుతూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

రాజాం: దీపావళి పండగ జరుపుకునే సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని పెనుబాక యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎ.మహేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెనుబాక గ్రామ పాఠశాలలోని విద్యార్థులకు క్రాకర్స్ కాల్చేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌వీజే నాయుడు, పి.బలరామ్మూర్తి, కె.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఎటువంటి కాలుష్యం జరగకుండా హరిత దీపావళి జరుపుకోవాలని వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాస్ మాస్టారు అన్నారు. శుక్రవారం మండలంలోని అలజంగి గ్రామ సీబీఎం పాఠశాలలో విద్యార్థులకు దీపావళి జాగ్రత్తలు వివరించారు. అనంతరం ప్రమిదల్లో దీపాలు వెలిగించి, దీపావళి జరుపుకున్నారు.

మారణహోమం ఆపాలి



పాలస్తీనాపై ఇజ్రాయిల్ దేశం చేస్తున్న దాడులకు నిరసనగా ర్యాలీ చేస్తున్న సీపీఎం నేతలు

రాజాం సిటీ: జాత్యాహంకారం పేరుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలని సీపీఎం నాయకుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు నిరసనగా స్థానిక పట్టణంలో నిరసన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. శరణార్థుల శిబిరాలపై దాడులు చేయడం, వేలాదిమంది ప్రాణాలు తీయడం దుర్మార్గమైన చర్యన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తప్పుపడుతూ తక్షణమే యుద్ధం నిలుపుదల చేసి, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనీల్ కుమార్, శ్రీనివాసరావు, రాజేష్, కనకరాజు, కృష్ణ, గురువులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత



వంగర: దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం: ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీకి సిద్ధం చేసిన ట్రై సైకిళ్లు

వంగర: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం దివ్యాంగులకు మంజూరు చేసిన ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చేతికర్రలను ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. మొత్తం 54 యూనిట్ల ఉపకరణాలను లబ్ధిదారులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపీడీవో శశిభూషణరావు, ఏవో ఎల్.త్రినాథ్, ఈవోపీఆర్డీ జి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని దివ్యాంగుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ట్రై సైకిళ్లు, ఇతర ఉపకరణాలను పంపిణీకి సిద్ధం చేశామని ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు. గతంలో రాజాంలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో గుర్తించిన మొత్తం 22 మంది దివ్యాంగులకు వీటిని అందజేయనున్నామన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

• వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రైతుల విజ్ఞప్తి



రాజాం: సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అప్పారావు

రాజాం: వర్షాలు లేకపోవడంతో సాగునీరు అందక పంటలు పోయామని, నష్టపరిహారం అందజేసి, ఆదుకోవాలని రైతులు వ్యవసాయాధికారులను కోరుతున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తొలుత మాట్లాడారు. ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్ వరి బాగా పండిందని, తోటపల్లి కాలువ ఆయకట్టులో మాత్రం ఇరిగేషన్ అధికారులు పొలాలకు చివరితడి కోసం నీటిని అందించలేకపోయారని వివరించారు. ఈ అలసత్వాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రాంతాల్లో సర్వే చేసి, రైతులకు నష్టపరిహారం అందేలా చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. జెడ్పీటీసీ బండి నర్సింహులు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని, ఇరిగేషన్ అధికారుల సాయం కూడా ఎంతో అవసరమన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు మాట్లాడుతూ రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించి, మంచి ఆదాయం పొందేలా అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు, వ్యవసాయాధికారి ఎ.రేణుకాసాయి, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, తహసీల్దారు ఎస్‌కే రాజు, ఎంపీడీవో శంకరరావు, సలహా మండలి సభ్యులు దూబ గోపాలం, నక్క శ్రీను, వంజరాపు విజయ్‌కుమార్, ముదిలి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు

400 ఎకరాల్లో పంటనష్టం..

బాడంగి: పంటలు నష్టపోయిన రైతాంగానికి న్యాయం జరిగేలా చూడాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు వ్యవసాయాధికారులను కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ సలహా సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట చేతికివచ్చే దశలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో పాటు పలు తెగుళ్ల వల్ల కూడా పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను కూడా త్వరితగతం చేయాలన్నారు. ధాన్యం తరలింపులో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. మండల వ్యవసాయాధికారి కె.శిరీష మాట్లాడుతూ ఇప్పటికే 15,292 ఎకరాల పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు చేశామని, వీటిలో 11,063 ఎకరాల్లో పంటలు సాగు కాగా 4,219 ఎకరాల్లో మామిడితోటల పెంపకం చేస్తున్నట్లు తెలిపారు. 8,046 ఎకరాల్లో వరి పంట సాగు జరగ్గా, 400 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించామన్నారు. ఇదే వాతావరణం కొనసాగితే 700 ఎకరాల్లో పంట నష్టం జరిగే అవకాశముందన్నారు. ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టామని, ధాన్యం రవాణా చేసే వాహనాలకు తప్పకుండా జీపీఎస్ ట్రాకింగ్ చేయించాలన్నారు. ఒక్కో వాహనానికి రూ.2470 ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటివరకు 18 ఆర్‌బీకేల పరిధిలో ధాన్యం తరలించేందుకు 56 వాహనాలను గుర్తించామన్నారు.

ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా చేపట్టాలి

• ఏడీ కోటేశ్వరరావు

చీపురుపల్లి: త్వరలో ప్రారంభంకానున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని వ్యవసాయశాఖ ఏడీ కోటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని కస్పావీధిలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న టీఏలు, డీఈఓలు, వీఏఏలకు శుక్రవారం ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌కు సంబంధించి ప్రతీ రైతుభరోసా కేంద్రంలోను ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణకు పంపించే ప్రతీ వాహనానికి జీపీఎస్ పరికరం తప్పనిసరిగా ఉండాలన్నారు. గోనె సంచులు, లేబర్ చార్జీలు, రవాణా చార్జీలు ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి మద్దతు ధర క్వింటాకు రూ.2183గా ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు.